సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



టన్ను చీనీ రూ. 22 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు పలికాయి. మార్కెట్‌కు 113 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.



కిలో టమాట రూ.10
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.2.50, సరాసరిన రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.8°/22.1°
జిల్లాలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం



మంత్రి పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఇతర నాయకులు

బత్తలపల్లి/పెనుకొండ: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గురువారం తిరుపతి నుంచి అనంతపురానికి రోడ్డు మార్గంలో వస్తున్న విషయాన్ని తెలుసుకొని పెనుకొండ,బత్తలపల్లి ప్రాంతాల్లో ఎమ్మెల్యే శంకరనారాయణ, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు కలిశారు. శాలువా కప్పి పూలబొకేలను అందజేశారు.

విద్యార్థి దశ నుంచే ప్రయోగాలపై శిక్షణ

- డీఈఓ మీనాక్షి



జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొన్న విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు

కొత్తచెరువు: సైన్స్‌పై ఆసక్తి పెంపొందించేలా వివిధ ప్రయోగాలపై విద్యార్థులకు విద్యార్థి దశ నుంచే శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఈఓ మీనాక్షి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 31వ బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్‌పై శిక్షణ తరగతులను నిర్వహించారు. డీఈఓ మీనాక్షి మాట్లాడుతూ ఇస్రో ఆధ్వర్యంలో చంద్రయాన్–3తో పాటు సూర్యునిపై పరిశోధనలకుగాను రాకెట్లను విజయవంతంగా ప్రయోగించడం ద్వారా మన శాస్త్రవేత్తల శక్తి సామర్థ్యాలను ప్రపంచ దేశాలు హర్షిస్తున్నాయన్నారు. సైన్సుపై విద్యార్థులకు మరింత ఆసక్తి కలిగేలా ఉపాధ్యాయులు బోధించాలని, తద్వారా వారికి మంచి భవిష్యత్తు ఇచ్చినవారవుతామని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటరమణ, డీసీ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వారికి సంబంధించిన సర్వీస్ మేటర్‌కు సంబంధించి సమస్యలు ఏవైనా ఉంటే అర్జీలు ఇవ్వవచ్చన్నారు. దరఖాస్తులో సీఎఫ్‌ఎంఎస్ ఐడీ, ఎంప్లాయీస్ గుర్తింపు నంబర్‌తో హాజరు కావాలన్నారు.

తాగునీటికే ప్రాధాన్యం





హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. చిత్రంలో మంత్రి ఉషశ్రీ చరణ్, ప్రభుత్వ విప్ కాపు, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి

- ఆరుతడి పంటల వైపు రైతులు దృష్టి సారించాలి
- అన్నదాతలను అధికారులు ప్రోత్సహించాలి
- జల చౌర్యం లేకుండా పకడ్బందీగా వ్యవహరించాలి
- ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- రైతులకు మేలు చేద్దాం : మంత్రి ఉషశ్రీచరణ్
- జెడ్పీలో ఐఏబీ సమావేశం

అనంతపురం సెంట్రల్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, భూగర్భ గనులశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. గురువారం జిల్లా పరిషత్ కార్యాలయంలోని డీఆర్‌సీ భవనంలో సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి దామాషా ప్రకారం కేటాయించిన 26.828 టీఎంసీల్లో 10 టీఎంసీలను తాగునీటి అవసరాలకు కేటాయించాలన్నారు. 16.828 టీఎంసీలను పంటలకు ఇవ్వాలని ఆదేశించారు. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా 40 టీఎంసీలు వస్తాయని భావిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 4 టీఎంసీలు తాగునీటి అవసరాలకు, మిగిలిన నీటిని చెరువుల ద్వారా పంటలకు ఇవ్వాలని సూచించారు. వీలైనంత వరకూ ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అధికారులు కూడా ప్రోత్సహించి నీటిని పొదుపుగా వాడుకునేలా అవగాహన కల్పించాలన్నారు. హెచ్చెల్సీ పరిధిలో గుంతకల్లు బ్రాంచ్ కెనాల్, ఎంపీ సౌత్, నార్త్ కెనాల్, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్, పీఏబీఆర్ కుడి కాలువలకు నిర్ణయించిన తేదీల ప్రకారం నీటిని విడుదల చేయాలని సూచించారు. రెవెన్యూ, పోలీసు, ఇంజినీరింగ్ సిబ్బంది సమన్వయం చేసుకుని నీటి చౌర్యాన్ని, వృథాను, అనధికారిక వాడకాన్ని అరికట్టాలని ఆదేశించారు. ఇప్పటికే సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులకు నిరంతరాయంగా 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్‌ కో అధికారులను ఆదేశించారు. యోగి వేమన, మిడ్‌పెన్నార్, బీటీపీ తదితర ప్రాజెక్టు గేట్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉన్న రెయిన్‌గన్‌లను సేకరించి అవసరమైన రైతులకు అందించాలని పేర్కొన్నారు.

రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ.. రైతులకు మేలు చేసేలా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. భైరవానితిప్ప ప్రాజెక్టు కింద పెండింగ్ భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని ప్రాంతాలకు సమానంగా నీటి పంపిణీ చేపట్టాలని ఆమె సూచించారు. అనంతరం పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, రాష్ట్ర నాటక అకాడమి చైర్‌పర్సన్ ప్రమీల, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, హెచ్‌ఎల్‌సీ ఎస్‌ఈ రాజశేఖర్, హంద్రీనీవా ఎస్‌ఈ దేసేనాయక్, సీపీఓ ప్రశాంత్‌కుమార్, ఆర్డీఓ మధుసూదన్, అగ్రికల్చర్ జేడీ ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్, ఫిషరీష్ డీడీ శాంతి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్ర, నగరపాలకసంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలో హెచ్చెల్సీ కింద ఉపకాల్వలకు నీటి విడుదలను సమావేశంలో ఖరారు చేశారు. వివరాలు..

కాలువ పేరు	నీటి విడుదల
ఎంపీ సౌత్‌కెనాల్	సెప్టెంబర్ 25 నుంచి
ఎంపీ నార్త్ కెనాల్	సెప్టెంబర్ 25 నుంచి
తాడిపత్రి బ్రాంచ్‌కెనాల్	అక్టోబర్ 15 నుంచి
సీబీఆర్	నవంబర్ 1 నుంచి
పీఏబీఆర్ కుడికాలువ	డిసెంబర్ 1 నుంచి

కేసీ కెనాల్ కోటా తీసుకోవాలి

దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చలువతో కేసీ కెనాల్ డైవర్షన్ కింద జిల్లాకు 10 టీఎంసీల నీటిని కేటాయించారు. జిల్లా హక్కుగా ఈ నీటిని కచ్చితంగా తీసుకోవాలి. హెచ్చెల్సీ కాలువ గట్లపై కంపచెట్లు పెరిగిపోతున్నాయి. వెంటనే వాటిని తొలగించాలి. కాలవపై నిరంతర గస్తీ కోసం లస్కర్లను నియమించాలి. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు ముందుకు తీసుకెళ్లాలి.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూస్తాం

జిల్లాలోని 22 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే సాగు చేసిన పంటలను ఏ విధంగా కాపాడుకోవాలనే అంశంపై అధికారులతో చర్చించాం. అధికారులను నిరంతరం అప్రమత్తం చేస్తున్నాం. ఇప్పటి వరకూ హెచ్చెల్సీ ద్వారా వచ్చిన నీటిలో తాగునీటి కోసం 3.43 టీఎంసీలు నిల్వ చేశాం. హంద్రీనీవా ద్వారా వస్తున్న నీటిని జీడిపల్లిలో స్టోర్ చేస్తున్నాం. తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. పంటలకు కూడా నీటిని సక్రమంగా విడుదల చేసేలా చర్యలు తీసుకుంటాం.

– ఎం. గౌతమి, అనంతపురం జిల్లా కలెక్టర్

9 గంటల విద్యుత్ సరఫరా చేయాలి

రైతులు నష్టపోకుండా వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా చేయాలి. రైతుల అభీష్టం మేరకు రెండు విడతల్లో సరఫరా చేస్తే మంచిది. వర్షాభావ పరిస్థితులతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. కాలవల్లో నీరు పారుతుంటే దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి గుర్తుకు వస్తున్నారు. జిల్లాలో ప్రాజెక్టులు నిర్మించిన ఘనత ఆయనదే. ప్రజలు ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటారు.

– రాజశేఖరరెడ్డి, చైర్మన్, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు

రైతులు నష్టపోకుండా చూడాలి



జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే సాగు చేసిన ఉద్యాన, ఇతర పంటలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇందుకోసం అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలి. ఏ ఒక్క రైతు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉంది.

– తలారి రంగయ్య, ఎంపీ, అనంతపురం

రెయిన్‌గన్స్‌పై విచారణ చేయించాలి



గత ప్రభుత్వ హయాంలో రూ. 300 కోట్లు ఖర్చు చేసి రెయిన్‌గన్లను కొనుగోలు చేశారు. ప్రస్తుతం అవన్నీ ప్రైవేటు వ్యక్తుల గోదాముల్లో ఉన్నాయి. ఎన్ని కొనుగోలు చేశారు, ఎన్ని ఉన్నాయనే లెక్కలు తీయాలి. ఈ అంశంపై విజిలెన్స్ విచారణ చేయించాలి.

– గోరంట్ల మాధవ్, ఎంపీ, హిందూపురం

నీటిని పొదుపుగా వాడుకోవాలి



రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి. తాగునీటి అవసరాలకు హంద్రీనీవా నీటిని తీసుకుంటే ఆయకట్టు రైతులకు మేలు జరుగుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో ఆరుతడి పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలి. ఎంపీఆర్, పీఏబీఆర్ గేట్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఈ ఏడాది దిగుబడి ఆధారంగా ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేలా చర్యలు తీసుకోవాలి. తుంగభద్ర ఎగువన కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులను నిలిపివేసేలా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలి.

– అనంత వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే, అనంతపురం

పేరూరు డ్యాంకు నీరు విడుదల చేయాలి



ముందుగా చెరువులను నింపి తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి. హంద్రీనీవా–2 కింద రాప్తాడు నియోజకవర్గంలో చెరువలకు, పేరూరు డ్యాంకు నీటిని విడుదల చేయాలి. పీఏబీఆర్ కింద పెండింగ్‌లో ఉన్న భూ సేకరణకు సంబంధించి పరిహారాన్ని అందించాలి. పాములరాయి చెరువును లోకలైజేషన్ చేయాలి. హెచ్చెల్సీ సమాంతర కాలువ గురించి కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు చేయాలి.

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే

చెరువులను నీటితో నింపాలి



పీఏబీఆర్ కుడికాలువ కింద ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో 16 చెరువులకు నీటిని అందించాలి. చివరి చెరువు వరకూ నీటిని తీసుకెళ్లేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి. జిల్లేడు బండ రిజర్వాయర్ కింద భూసేకరణకు అవసరమైన నిధులు అందించాలి. వైవీఆర్ రిజర్వాయర్ గేట్ల లీకేజీ మరమ్మతులకు రూ. 13 లక్షలు కేటాయించాలి. ఈ క్రాప్ బుకింగ్‌లో కొత్త సాఫ్ట్‌వేర్‌తో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలి.

– కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే, ధర్మవరం

వృథా అరికట్టాలి



మిడ్‌పెన్నార్ గేట్లు మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో నీరు వృథా జరుగుతోంది. వెంటనే గేట్ల మరమ్మతులు చేపట్టాలి. సుబ్బరాయసాగర్‌కు నీరు రావడం లేదు. రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి. సమయపాలన ప్రకారం పెండేకల్లు, చాగల్లు, ముచ్చుకోట, సుబ్బరాయసాగర్ ప్రాజెక్టులను నీటిని విడుదల చేయాలి.

– కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఎమ్మెల్యే, తాడిపత్రి

చివరి ఆయకట్టుకూ అందించాలి



జిల్లాలో శింగనమల నియోజకవర్గం అత్యంత వెనుకబడి ఉంది. నియోజకవర్గంలో 46 చెరువులు న్నాయి. అన్నింటినీ నీటితో నింపాలి. చివరి ఆయకట్టు వరకూ నీటిని అందించే విధంగా అధికారులు చర్య లు తీసుకోవాలి. కాలవలకు పగళ్లు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. వేలాది కుటుంబాలు ఆధారపడిన శింగనమల చెరువుకు నీటిని విడుదల చేయాలి.

– జొన్నలగడ్డ పద్మావతి, ఎమ్మెల్యే, శింగనమల

తాగునీరు పుష్కలంగా ఇవ్వాలి



గుంతకల్లు పట్టణ ప్రజలకు సరిపడేంతగా తాగునీరు ఇవ్వాలి. హెచ్చెల్సీ ద్వారా 18 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉన్నా జీబీసీ ద్వారా కేవలం 4 వేల ఎకరాలకు మించి ఇవ్వడం లేదు. హెచ్చెల్సీ, హంద్రీనీవా అధికారులు సమన్వయంతో పనిచేసి ఆయకట్టుకు, చెరువులకు నీరందించాలి. రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలి.

– వై. వెంకట్రామిరెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే

మట్టి గణపయ్యకి జై !

- పర్యావరణానికి హాని కలగకుండా విగ్రహాలు
- 'పురం'లో వినూత్న ఆకృతులతో సిద్ధం చేస్తున్న కోల్‌కత్తా కళాకారులు





బెంగళూరు రోడ్డులో భారీ గణనాథుడి తయారీలో నిమగ్నమైన కళాకారుడు   రూపుదిద్దుకుంటున్న బాహు గణపతి

హిందూపురం: పల్లెలు, పట్టణాలకు గణేష్ ఉత్సవాల శోభ వచ్చింది. పర్యావరణానికి ఎలాంటి హానీ కలగని వినాయక విగ్రహాల ఏర్పాటు వల్ల స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ వేత్తలు, వివిధ శాఖల అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగానే హిందూపురంలో ఎక్కువ మంది గణేష్ మంటపాల నిర్వాహకులు మట్టి గణపయ్యలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో కోల్‌కత్తా నుంచి హిందూపురానికి వచ్చిన కళాకారులు రెండు మూడు ప్రాంతాల్లో వినూత్న ఆకృతులతో విగ్రహాలను తయారు చేస్తున్నారు. కేవలం వరిగడ్డి, బంకమట్టి, పొట్టు, వాటర్ కలర్స్ మాత్రమే వినియోగిస్తూ వినాయక విగ్రహాలను తయారు చేస్తుండటంతో పర్యావరణ ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎత్తు, ఆకృతిని బట్టి రూ.30 నుంచి రూ.లక్ష దాకా విగ్రహాలను తయారు చేస్తున్నట్లు కలకత్తా కళాకారులు చెబుతున్నారు. హిందూపురం మాత్రమే కాకుండా పెనుకొండ, పుట్టపర్తి, అనంతపురం, కదిరి, ధర్మవరం, పరిగి, కర్ణాటక ప్రాంతాలకు కూడా చెందిన వారు సైతం ముందే ఆర్డర్లు ఇచ్చి నచ్చిన రీతిలో విగ్రహాలను తయారు చేయించుకుంటున్నారు.



పులులున్న సింహాసనంపై వినాయకుడు



విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న కోల్‌కత్తా కళాకారుడు

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకురావడం మాత్రం మరచిపోవద్దే!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన

శిబిరం చిరునామా:
శ్రీసాయి విద్యానికేతన్ సాయిగీతా స్కూల్, డో.నంబర్ : 2/189, పెద్ద బజారు, పుట్టపర్తి.
ఫోన్ నంబరు : 9912220726

ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

హిందూపురం టౌన్: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ పురుషుల జట్టును ఎంపిక చేశారు. గురువారం స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో ఫుట్‌బాల్ జట్టు ఎంపికకు వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. ప్రతిభ కనబరిచిన 20 మందితో జట్టును ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ తెలిపారు. జిల్లా జట్టు ఈ నెల 16న కదిరిలో జరిగే జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మహమ్మద్ సలీమ్, కోశాధికారి శేఖర్, పీడీ లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

108లో ప్రసవం



పండంటి బిడ్డకు జన్మనిచ్చిన తల్లి

ముదిగుబ్బ: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లోనే ప్రసవించింది. వివరాలు... ముదిగుబ్బ మండలం నాగులగుబ్బల గ్రామానికి చెందిన నిండు గర్భిణి నవ్యశ్రీకి గురువారం పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు వెంటనే ముదిగుబ్బ పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. కాన్పు కష్టతరంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో పండంటి ఆడబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను బత్తలపల్లి ఆస్పత్రికి 108 ఈఎంటీ రవికుమార్, పైలెట్ నారాయణస్వామి నాయక్ చేర్చారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

కర్నూలుకెళ్లి పింఛన్ అందజేత



రామాంజప్పకు పింఛన్ నగదు అందిస్తున్న వలంటీర్ పేరేంద్రప్రసాద్

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో పని చేస్తున్న వలంటీర్ పేరేంద్ర ప్రసాద్ తన పరిధిలో ఉన్న మండ్లి రామాంజప్పకు ఈ నెలలో రెండో విడతలో మంజూరు చేసిన రూ.3 వేల పింఛన్‌ను కర్నూలుకు వెళ్లి అందించి సేవాభావాన్ని చాటుకున్నాడు. డప్పు కళాకారుడైన రామాంజప్పకు అర్హత ఆధారంగా ఇటీవల ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. అయితే డయాలసిస్ కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో రామాంజప్ప చేరినట్లుగా తెలుసుకున్న పేరేంద్రప్రసాద్ బుధవారం రాత్రి కర్నూలుకు బయలుదేరి వెళ్లాడు. అర్ధరాత్రి ఆస్పత్రిలో రామాంజప్పను కలసి బయోమెట్రిక్ ఆధారంగా పింఛన్ నగదు అందజేశారు. అత్యవసర సమయంలో ఆస్పత్రికే వచ్చి పింఛన్ అందజేసిన వలంటీర్ పేరేంద్రప్రసాద్‌కు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విషయం తెలుసుకున్న సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు అభినందించారు.

ముష్టి 25 సీట్ల కోసం పొత్తా

- పవన్‌కళ్యాణ్‌పై ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ధ్వజం
- ప్రశ్నిస్తానని అవినీతి పరుడితో పొత్తు కుదుర్చుకోవడం దారుణం



విలేకరులతో మాట్లాడుతున్న ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

అనంతపురం సెంట్రల్: 'అవినీతిపై ప్రశ్నిస్తానంటూ రాజకీయాల్లోకి వచ్చి ముష్టి 25 సీట్ల కోసం దిగజారి అవినీతిపరుడితో పొత్తు పెట్టుకుంటావా?' అంటూ జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌పై ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ధ్వజమెత్తారు. అనంతపురం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 25 సీట్ల కోసం కాకుండా నేరుగా పోటీ చేసి ఉంటే రాజకీయాల్లో క్రెడిబిలిటీ ఉండేదన్నారు. పొత్తు విషయాన్ని కమలనాథులను అడిగి ప్రకటించారా? లేదా బీజేపీతో తెగతెంపులు చేసుకున్నాడా అనేది తేలడం లేదన్నారు. ఎప్పుడో ఓసారైనా సీఎం రేసులో ఉంటాడని అందరూ భావించారని, అయితే ఆ పోటీలో కాకుండా చంద్రబాబు వీల్ చైర్ దొబ్బేందుకు సిద్ధం కావడం సిగ్గుచేటన్నారు. పవన్‌కళ్యాణ్ రాజకీయాలు కాకుండా చంద్రబాబుకు ఊడిగం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. సోషల్‌మీడియా ద్వారా తన తల్లిని దూషించిన లోకేష్‌ను వదిలిపెట్టబోనని ప్రతిజ్ఞ చేసిన పవన్ కళ్యాణ్... తాజాగా వాళ్లతోనే పొత్తు పెట్టుకోవడం వెనుక అంతర్యమేమిటో బహిర్గతం చేయాలన్నారు. పొత్తు రాష్ట్ర భవిష్యత్తు కోసమంటూ ప్రకటించిన జనసేనాని తీరు చూస్తుంటే ఆయన భవిష్యత్తు కోసమేనన్నది స్పష్టమవుతోందన్నారు. రాజకీయాల్లో ఎప్పుడూ వన్ ప్లస్ వన్ టూ కాదనే విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. టీడీపీకి రాష్ట్రంలో 175 స్థానాలకు అభ్యర్థులు లేకపోవడం వల్లనే జనసేనతో పొత్తు పెట్టుకుంటోందని విమర్శించారు.

నిరూపిస్తే రాజీనామా చేస్తా ..

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో జైలు వెళ్లిన చంద్రబాబు ఎంతసేపూ టెక్నికల్‌గా తనను అరెస్ట్ చేయకూడదని చెబుతున్నారని, తాను నిర్దోషిగా ఎక్కడేగాని పెదవి విప్పడం లేదన్నారు. ఆదాయానికి మించిన అక్రమ ఆస్తులు కూడబెట్టిన అంశంలో కాకుండా రూ.118 కోట్లు వివిధ అకౌంట్ల ద్వారా అవినీతి జరిగిందని సీఐడీ సాక్ష్యాధారాలతో అరెస్ట్ చేసిందన్నారు. రూ. 3,370 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్న సీమెన్స్ కంపెనీ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడైనా చిన్నపాటి మెటీరియల్ వచ్చిన దాఖలాలు కానీ, సీనియర్ సాఫ్ట్‌వేర్ మీద ట్రైనింగ్ ఇచ్చినట్లు నిరూపిస్తే తాను రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. 'ఎంతసేపూ హైదరాబాద్‌లో సైబర్ టవర్ కట్టించా.. సత్యనాదెళ్ల నా వల్లే ఆ స్థాయికి వచ్చాడు' అని చెప్పుకునే చంద్రబాబు ప్రజలకు తాను చేసిన మంచి ఏమిటో స్పష్టంగా చెప్పలేక పోతున్నారన్నారు. రాష్ట్రంలో యువతకు మేలు జరిగిందనుకుంటే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా నాడు వైఎస్సార్, నేడు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వల్లేనన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

- ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చీఫ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి

పెనుకొండ: ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి చేపట్టిన నూతన భవనాల నిర్మాణంలో ఎక్కడేగానీ నాణ్యతలో రాజీ పడబోరాదని పంచాయతీ రాజ్ ఇంజినీర్లను ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి ఆదేశించారు. భవన నిర్మాణాల్లో నాణ్యతపై పెనుకొండలోని ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ, పీఆర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం ఆయన సమీక్షించారు. పనుల్లో పాటించాల్సిన సాంకేతిక అంశాలను వివరించారు. పనులు వేగవంతంచేయాలన్నారు. అనంతరం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలసి గోరంట్ల మండలం మల్లాపల్లి, బూదిలి గ్రామాల్లో జగనన్న హౌసింగ్ కాలనీ పనులను పరిశీలించారు. పీఆర్ డీఈ రమణ, డీపీఆర్ఈడీ గోపాలరెడ్డి, పెనుకొండ ఈఈ పీఆర్ఐ మురళీమోహన్, ఈఈ పీఐయూ పుట్టపర్తి శ్రీనివాసులు, పెనుకొండ డీఈఈ శ్రీనివాసులు, అనంతపురం డిప్యూటీ ఈఈ భరత్‌ప్రకాష్, రమణ, సుధాకర్‌నాయక్, పెనుకొండ, ధర్మవరం, మడకశిర, హిందూపురం, రాప్తాడు మండలాలకు చెందిన ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలి
- రాప్తాడు నియోజకవర్గ సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (చిత్రంలో) మంత్రులు పెద్దిరెడ్డి, ఉషశ్రీ చరణ్

అనంతపురం సెంట్రల్: ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. జెడ్పీలోని డీపీఆర్సీ భవనంలో గురువారం రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రులు పెద్దిరెడ్డి, కేవీ ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, కలెక్టర్ ఎం.గౌతమి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ... దృష్టికి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని సమన్వయం చేసుకుని అర్హులైన వారికి పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెండు మూడు రోజుల్లోపు ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న విద్యుత్ ఏఈ పోస్టుల నియామకానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఈ ఆర్థిక సంవత్సరంలో రాప్తాడు నియోజకవర్గ పరిధిలో 111 మంది రైతులకు దాదాపు రూ. 93 లక్షలు విలువజేసే డ్రిప్, స్ప్రింక్లర్లను మంత్రి చేతుల మీదుగా అందజేశారు.

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. పీఏబీఆర్ నుంచి చిన్మయనగర్, రాప్తాడు మండలం, పాపంపేట, రాచానుపల్లి తదితర పంచాయతీల పరిధిలోని ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. ఐటీ కంపెనీ ఏర్పాటుకు ముందుకు వచ్చిన టెక్నుల్స్ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఏపీఐఐసీ పార్క్‌లో 10 ఎకరాలు, శౌరి ఎక్స్‌పోర్ట్ గార్మెంట్స్ ఇండస్ట్రీ కోసం కూడా భూమిని కేటాయించాలన్నారు. 90 రోజుల్లో ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం కింద అనంతపురం రూరల్ పరిధిలో 3,600 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. మరో నాలుగు వేల గృహ నిర్మాణాలకు డీపీఆర్ పంపడం జరిగిందని, వెంటనే మంజూరు చేయాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని మూడు మండలాలకు సంబంధించి పదివేల గృహాల అవసరం ఉందని, ఇందు కోసం అవసరమైన భూమిని కొనుగోలు చేయాలన్నారు. ఈ ఏడాది రైతులకు దిగుబడి ఆధారంగా పంటల బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీఏబీఆర్ కుడికాలువకు అక్టోబర్‌లో నీటిని విడుదల చేయించాలన్నారు. హెచ్ఎల్ఎస్ఎస్ నుంచి పేరూరు డ్యామ్‌కు ఒక టీఎంసీ నీటిని విడుదల చేస్తే నియోజకవర్గంలోని 250 గ్రామాల పరిధిలో భూగర్భజలం పెరుగుతుందన్నారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాలకు మార్కెట్ యార్డ్‌ను మంజూరు చేయాలన్నారు.రాప్తాడు మార్కెట్ యార్డ్‌కు అవసరమైన భూమిని కేటాయించాలన్నారు. సచివాలయాల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయించాలని విన్నవించారు.

కలెక్టర్ ఎం.గౌతమి మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు మంజూరుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో సీపీఓ ప్రశాంత్ కుమార్, ఆర్డీఓ మధుసూదన్, హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్, ఫిషరీష్ డీడీ శాంతి, ఎల్‌డీఎం సత్యరాజ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, రాప్తాడు నియోజకవర్గ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

అన్నదమ్ముల దుర్మరణం



ప్రదీప్



దిలీప్ (ఫైల్)

నల్లమాడ: బతుకు తెరువు కోసం బెంగళూరుకు వలస వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. కన్నబిడ్డలిద్దరూ ఒకేసారి మృత్యువాత పడడంతో ఆ తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలింది. వివరాలు.. శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండలం కురుమాల గ్రామానికి చెందిన చాకలి సంగాల లలితమ్మ, చెన్నకేశవులు దంపతులకు ప్రదీప్, హర్షవర్ధన్, దిలీప్ అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో ఐటీఐ పూర్తి చేసిన పెద్ద కుమారుడు ప్రదీప్ (25), మూడో కుమారుడు దిలీప్ (23) తొమ్మిదేళ్ల క్రితం బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఎలక్ట్రీషియన్లుగా పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉన్నారు. ప్రదీప్‌కు మూడేళ్ల క్రితం నల్లమాడ మండలం పాతబత్తలపల్లికి చెందిన లక్ష్మితో వివాహమైంది. దిలీప్ అవివాహితుడు. అన్నదమ్ములు ఒకే ఇంట్లో ఉంటూ విధులకు వెళ్లి వచ్చేవారు. ఈ క్రమంలో గురువారం ఉదయం 6.30 గంటలకు అన్నదమ్ములిద్దరూ ఒకే ద్విచక్ర వాహనంపై విధులకు వెళుతుండగా మార్గమధ్యంలో ఓ ట్రక్కు ఢీకొంది. తలపై చక్రం వెళ్లడంతో ప్రదీప్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన దిలీప్‌ను స్థానికులు నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స అందేలోపు ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలియగానే కురుమాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎంత ఘోరం జరిగిపోయిందో అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటిన బెంగళూరుకు తరలివెళ్లారు. బాధిత కుటుంబసభ్యులకు ఆస్థానిక వైఎస్సార్‌సీపీ నేత కె.రాజారెడ్డి అండగా నిలిచారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను గురువారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కుమారుల మృతదేహాలను చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

సోమందేపల్లి: స్థానిక నల్లగొండ్రాయనపల్లి క్రాస్ వద్ద బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... నాగినాయనిచెరువు తండాకు చెందిన విజయ్‌కుమార్ నాయక్(37) ద్విచక్రవాహనంలో సోమందేపల్లి వైపు నుంచి స్వగ్రామానికి వెళుతూ రోడ్డు దాటుతుండగా బెంగళూరు వైపు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న కర్ణాటక బస్సు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన విజయ్‌కుమార్ నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. దాదాపు 50 అడుగుల దూరం మేర ద్విచక్రవాహనాన్ని బస్సు ఈడ్చుకెళ్లింది. మృతుడు హైదరాబాద్‌లోని ఓ పరిశ్రమలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. సెలవుపై ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఘటనపై ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మహారాష్ట్ర వాసి దుర్మరణం

లేపాక్షి: ట్రక్ ఢీకొన్న ఘటనల మహారాష్ట్రకు చెందిన ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... మహారాష్ట్రలోని అహమ్మద్‌నగర్‌కు చెందిన సందీప్ (35) గురువారం ఉదయం లేపాక్షి నుంచి పరిగి వైపు ద్విచక్రవాహనంలో వెళుతుండగా కల్లూరు సమీపంలో జాతీయ రహదారిపై ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన ట్రక్ ఢీకొంది. సందీప్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై ఎస్ఐ మునీర్ అహమ్మద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గొర్రెల కాపరి మృతికి కారణమైన వ్యక్తి అరెస్ట్

అమరాపురం: పంటకు విద్యుత్ కంచె ఏర్పాటు చేసి గొర్రెల కాపరి మృతికి కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు మడకశిర సీఐ సురేష్‌కుమార్, అమరాపురం ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు వివరాలు వెల్లడించారు. అమరాపురం మండలం నిడ్రఘట్ట గ్రామానికి చెందిన రైతు కృష్ణగిరి తాను సాగు చేసిన పంటను అడవి పందుల బెడద నుంచి కాపాడుకునేందుకు జీఏ వైర్‌తో అక్రమంగా విద్యుత్ కంచె ఏర్పాటు చేసుకున్నాడు. ఈ విషయం తెలియని కెంకెర గ్రామానికి చెందిన రంగనాథ్ తన గొర్రెల మందను మేపునకు తోలుకెళుతూ కృష్ణగిరి ఏర్పాటు చేసుకున్న విద్యుత్ కంచెపై ప్రమాదవశాత్తు కాలు పెట్టడంతో షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం సాయంత్రం మడకశిరలోని నిడ్రఘట్ట సర్కిల్ వద్ద తచ్చాడుతున్న కృష్ణగిరిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో పొలానికి 70 మీటర్ల పొడవునా జీఏ వైర్‌తో విద్యుత్ కంచె ఏర్పాటు చేసినట్లుగా అంగీకరించాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

పుట్టపర్తి అర్బన్: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన వివిధ రకాలైన పంటలు, పండ్లు ఆరోగ్యకరమని రాష్ట్ర రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం కింద సాగవుతున్న పండ్ల తోటలు, ఇతర పంటలను విదేశీయులతో కలిసి పరిశీలించారు. గురువారం పుట్టపర్తి మండలం పెడపల్లి, కొట్లపల్లి, మార్లపల్లి గ్రామాల్లో పర్యటించారు. ప్రకృతిలో దొరికే పేడ ఎరువు, ఆకులు ఇతర వ్యర్థాలను కుళ్లబెట్టిన ఎరువులు, డంపింగ్ యార్డుల్లో దొరికే సేంద్రియ ఎరువులను ఉపయోగించి రైతులు పంటలు సాగు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 100 గ్రామాల్లో మాత్రం ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని రాబోవు రోజుల్లో దీన్ని రెట్టింపు చేయనున్నట్లు డీపీఎం లక్ష్మానాయక్ చెప్పారు. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందన్నారు. దీని ద్వారా మంచి లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జర్మనీకి చెందిన రాజ్‌పటేల్, అమెరికాకు చెందిన ప్రణయ్, జర్నలిస్టులు సునీత నారాయణ్, క్రిస్టియన్ గ్రేప్, జిల్లా కోఆర్డినేటర్ భానుమతి తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: మండలంలోని మరూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పంటలను రాష్ట్ర రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ బృందం పరిశీలించింది. మునగ, టమాట, గోరు చిక్కుడు పంటలను పండిస్తున్న పెద్ద నరసింహులు, చిన్న నరసింహులు పొలాలను పరిశీలించి భూమిలో వచ్చిన మార్పులు, రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు.

'స్క్రబ్ టైఫస్'తోనే యువకుడి మృతి

- నిర్ధారించిన జిల్లా వైద్యాధికారులు

ధర్మవరం రూరల్: మండలంలోని పోతుకుంట గ్రామాన్ని గురువారం జిల్లా వైద్యాధికారులు సందర్శించారు. గ్రామానికి చెందిన యువకుడు మధు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల బెంగళూరు ఆస్పత్రిలో మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని, అందుకు గల కారణాలను ఆరా తీసేందుకు జిల్లా సర్వేలైన్స్ ఆఫీసర్ డాక్టర్ కుళ్లాయప్ప నాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సెల్వియా సాల్మన్, మండల వైద్యాధికారి పుష్పలత గురువారం ఉదయం ఆ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. బెంగళూరు వైద్యులు అందజేసిన రికార్డులు పరిశీలించి స్క్రబ్ టైఫస్ (ఓరియంటియా సుత్సుగముషి అనే బ్యాక్టీరియా ద్వారా సోకిన జ్వరం)తో బాధపడుతూ మృతి చెందినట్లుగా నిర్ధారించుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, మహిళా సంఘం సభ్యులు, వలంటీర్లు, స్థానికులతో సమావేశాన్ని నిర్వహించి స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ఆకస్మికంగా జ్వరం రావడం, దగ్గు, కొన్ని సార్లు శరీరంపై దద్దుర్లు రావడం లాంటి లక్షణాలను తేలిగ్గా తీసుకోకూడదన్నారు. దీనివల్ల కిడ్నీలు, లివర్, ఊపిరితిత్తులు, రక్త కణాలు దెబ్బతినడంతో రోగి మృతి చెందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ వ్యాధి విస్తరించకుండా ఉండేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల లార్వా నిర్మూలనపై చైతన్య పరిచారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కళావతి, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి జయరాం నాయక్, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, ఆరోగ్య కార్యకర్తలు ఆంజనేయులు, శ్యామల, ఆశ కార్యకర్తలు ఆదినారాయణమ్మ, లక్ష్మీ నరసమ్మ, భానుబీ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి బలవన్మరణం

ధర్మవరం అర్బన్: జీవితంపై విరక్తితో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన హరీష్‌కుమార్ సింగ్ (73) ధర్మవరంలోని చైతన్య కాలనీలో నివాసముంటూ చెత్త ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యానికి గురైన ఆయన జీవితంపై విరక్తితో గురువారం ఉదయం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. హిందూపురం జీఆర్పీ ఎస్ఐ బాలాజీ నాయక్ కేసు నమోదు చేశారు.

'బండారు' భూదాహానికి దివ్యాంగురాలి బలి

- రవికుమార్ మోసాన్ని సెల్ఫీలో వివరించి ఆత్మహత్య



ఎ: రాజమ్మ (ఫైల్)

బుక్కరాయసముద్రం: అధికారం ఉన్నా లేకపోయినా టీడీపీ నేతల ఆగడాలు ఆగడం లేదు. నేటికీ భూ దందాలకు పాల్పడుతున్నారు. అమాయకుల ప్రాణాలు బలిగొంటున్నారు. గత ఎన్నికల్లో శింగనమల నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బండారు శ్రావణి తండ్రి బండారు రవి కుమార్ భూ దాహానికి తాజాగా ఒక దివ్యాంగురాలు బలైంది. తనకు జరిగిన మోసాన్ని ఆ అభాగ్యురాలు ఉరేసుకోబోతూ సెల్ఫీ వీడియోలో వివరించడం విషాదం నింపింది. పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కరాయసముద్రం మండల పరిధిలోని సిద్దరాంపురం గ్రామానికి చెందిన నాగరాణి అలియాస్ రాజమ్మ (44) దివ్యాంగురాలు. ఆమెకు గ్రామ సర్వే నంబర్-218.2లో 3.67 ఎకరాల భూమి ఉంది. కొన్ని రోజుల క్రితం ఈ భూమిని రాజమ్మ తల్లి సాకే నాగమ్మ తన చిన్నాన్న అయిన బండారు నారాయణస్వామి వద్ద రూ. 25 వేలకు కుదువ పెట్టింది. అయితే, రూ. కోటి విలువ చేసే ఈ భూమిని ఎలాగైనా సొంతం చేసుకోవాలని నారాయణస్వామి కుమారుడు బండారు రవి కుమార్ భావించాడు. ఇటీవల నాగమ్మ మృతి చెందగా, ఈ క్రమంలో కుదువ పెట్టిన భూమిని విడిపించుకునేందుకు 10 రోజుల క్రితం రూ. 25 వేలకు వడ్డీ, అసలు కలిపి రూ.1.25 లక్షలు తీసుకుని బండారు రవి కుమార్ ఇంటికి రాజమ్మ వెళ్లింది. అయితే, ఆ భూమి తమదని, వేరే వారికి అమ్మేస్తున్నామని ఆయన దౌర్జన్యం చేశాడు. దీంతో రాజమ్మ ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చేసింది. జరిగిన విషయాన్ని తన బంధువులతో చెప్పి బోరున విలపించింది. ఈ క్రమంలోనే శనివారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఉరేసుకునే ముందు తనకు జరిగిన అన్యాయాన్ని సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియోలో వివరించింది. శింగనమల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బండారు శ్రావణి తండ్రి బండారు రవి కుమార్ తమ భూమిని లాక్కున్నారని వాపోయింది. ఏవో మాటలు చెప్పి ఇటీవల తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకున్నాడని ఆరోపించింది. రాజమ్మ ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన బంధువులు ఇంటి తలుపులు చూడగా ఉరికి వేలాడుతూ కనిపించింది. మృతురాలి సోదరుడు, ఎంపీటీసీ నాగేంద్ర సమాచారం మేరకు సీఐ నాగార్జున రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజమ్మ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భూసారం పెంపుతో అధిక దిగుబడి

ఎన్‌పీకుంట: రసాయనిక ఎరువులు తగ్గించి, పశువుల ఎరువులు వాడడం వల్ల భూసారం పెరిగి పంటల సాగులో అధిక దిగుబడి సాధించవచ్చునని కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ బీకే కిషోర్‌రెడ్డి సూచించారు. నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై ఎన్‌పీకుంట మండలం మరికొమ్మదిన్నె, ధనియానిచెరువు గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. చివరి రోజు వేరుశనగ, వరి పంటల్లో తెగుళ్లు, చీడపీడల నివారణ,. గొర్రె పిల్లలు, ఆవుల యాజమాన్య పద్ధతులు, మేకలలో రోజువారీ తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ బాలానాయక్, సిద్దరామపురం పశువైద్య పరిశోధనా క్షేత్రం వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ రఘుకరణ, కేవీకే పశువైద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కె.మాధవి, విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ బి.చందన, వాటర్‌షెడ్ చైర్మన్లు ఓబుళరెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ దీక్షలో విద్యార్థులు

- బలవంతంగా కూర్చోబెట్టిన తమ్ముళ్లు



టీడీపీ దీక్షలో విద్యార్థులను బలవంతంగా కూర్చోబెట్టుకున్న దృశ్యం

మడకశిర: చంద్రబాబు అరెస్ట్‌ను వ్యతిరేకిస్తూ టీడీపీ నాయకులు మడకశిరలో గురువారం దీక్ష చేపట్టారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షకు టీడీపీ నాయకులు విద్యార్థులను వాడుకున్నారు. టీడీపీ దీక్ష.. జనం లేక వెలవెలబోయింది. అయితే అదే రోడ్డులో వివిధ కళాశాలలకు వెళుతున్న విద్యార్థులను తెలుగు తమ్ముళ్లు బలవంతంగా తీసుకెళ్లి దీక్షలో కూర్చోబెట్టారు. టీడీపీ నాయకుల చర్యలతో స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు.